25-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - కేవలం రెండు పదాలను గుర్తు పెట్టుకోండి - మేము సద్గురువుని మనవలము, బ్రహ్మ తండ్రి ద్వారా తాతగారి వారసత్వాన్ని తీసుకుంటాము"

ప్రశ్న:- ఉన్నతిలోకి వెళ్తూ ఉంటే వైకుంఠ రసాన్ని ఆస్వాదిస్తారు... ఈ గాయనం పిల్లలైన మీకే వర్తిస్తుంది, వేరే వారికి కాదు - ఎందుకు?

జవాబు:- ఎందుకంటే మీ ఎదురుగా గొప్ప గమ్యం ఉంది. మీరు తండ్రి వద్దకు ఇల్లు అయిన పరంధామానికి వెళ్తారు, మళ్ళీ క్రొత్త ప్రపంచంలోకి వస్తారు. ఇతురులెవరి కోసము కూడా ఈ గాయనము ఉండజాలదు. అయితే, వారిలో కూడా కచ్చా-పక్కా నంబరువారుగా ఉంటారు కానీ వారి ఎదురుగా గమ్యం ఉండదు. వారికి వైకుంఠ రసము గురించి తెలియదు కూడా. పిల్లలైన మీరే అంటారు - ఏ మార్గములోనైతే పడడము మరియు సంభాళించుకోవడము ఉంటుందో ఇప్పుడు మేము ఆ మార్గంలో నడవాలి.

పాట:- మనము ఆ మార్గంలో నడవాలి... (హమే ఉన్ రాహో పర్ చల్నా హై...)

ఓంశాంతి. పాట మోగేటప్పుడు, మా కొరకు ఇందులో కూడా జ్ఞానము ఉంది అని పిల్లలు భావిస్తారు. అజ్ఞానీ మనుష్యులకు ఇందులో అజ్ఞానము ఉంది. జ్ఞానీ ఆత్మల కోసం ఇందులో జ్ఞానము ఉంది. తప్పకుండా మాయ తుఫానులే పడేస్తాయి, మళ్ళీ ఈశ్వరుడైన తండ్రి పైకెక్కిస్తారు అనగా పడిపోయినవారికి జ్ఞానమనే సంజీవని మూలికను ఇస్తారని అర్థం చేసుకుంటారు. ఒకవేళ ఎవరైనా కామమనే తుఫానులోకి వచ్చినట్లయితే పడిపోతారు, మళ్ళీ క్రోధము అనే తుఫాను వచ్చినప్పుడు కూడా పడిపోవడం జరుగుతుంది. ఈ విధంగా పడిపోవడము మరియు ఎక్కడము జరుగుతుంది. ఉన్నతిలోకి వెళ్తే వైకుంఠ రసాన్ని ఆస్వాదిస్తారు... ఇప్పుడు ఈ పాట మీకు తప్ప ఇంకెవ్వరికీ వర్తించదు. సన్యాసులకు కూడా వర్తించదు. వారి వద్ద కూడా కచ్చా సన్యాసులు ఉంటారు కానీ వారికి ఏ గమ్యము ఉండదు. మీదైతే చాలా పెద్ద గొప్ప గమ్యము. వారు శాస్త్రాలు మొదలైనవి చదివి విద్వాంసులుగా అయిపోతారు. అంతేకానీ, రాజ్యము మొదలైన గమ్యమేమీ ఉండదు, ఇందులో చాలా ఉన్నతమైన గమ్యము ఉంది. అనంతమైన బాప్ దాదా చదివిస్తున్నారని పిల్లలకు తెలుసు. మమ్మా కూడా చదివిస్తారు, అలాగే పిల్లలు కూడా చదివిస్తారు. మీరు తాతా మనుమలు. అమృత్సర్ లో తాతలు, మనవలు ఉంటారు, ఇది ఏడవ తరము, ఇది రెండవ తరము అని అంటారు. సత్యయుగంలో కూడా దేవతల తరాలు కొనసాగుతాయని మీరు అర్థం చేసుకుంటారు. మొదటి తరము, రెండవ తరము... ఇక్కడ మీ తరాలు ఉండవు. ఒక్క తాతగారు, ఒక్క తండ్రి, ఒక్క మమ్మా మరియు కుమారులు-కుమార్తెలు. అంతే, తాతగారు, మనవలు తర్వాత ఇంకెవ్వరూ ఉన్నారని అనరు. ఇప్పుడు ఇది స్మృతి చేయడమైతే చాలా సహజము. మనం బ్రహ్మాకుమారులము, కుమారీలము. బ్రహ్మా మన తండ్రి. తాతగారు శివుడు. వారి ద్వారా ఆస్తి లభిస్తుంది. ఇది ఎంత సహజమైన విషయము. మనము తాతా మనవలము, బ్రహ్మాకుమారులము-కుమారీలము. బ్రహ్మా శివునికి ఒకే ఒక్క పుత్రుడు. మనం విష్ణు కుమారీలము లేక శంకర కుమారీలము అని అనరు. ప్రజాపిత అని ఒక్క బ్రహ్మానే అంటారు. బాబా చాలా సహజంగా అర్థం చేయిస్తారు. బ్రహ్మాకుమారులు-కుమారీలు. మీరు శివబాబా నుండి వారసత్వాన్ని తీసుకొనేందుకు బ్రహ్మాకుమారులుగా, కుమారీలుగా అయ్యారు. ఇలా-ఇలా ఎవరికైనా అర్థం చేయించండి అని శివబాబా అంటారు. స్మృతి తప్పకుండా శివబాబానే చేయాలి, వారి నుండే వారసత్వం లభిస్తుంది. ఇంకెవరినైనా స్మృతి చేసినట్లయితే నరకం యొక్క వారసత్వము లభిస్తుంది, ఇది అర్థం చేసుకోవలసిన విషయము. వారసత్వం తండ్రి నుండి కాదు, తాతగారి నుండి లభిస్తుంది.

స్వర్గ రచయిత, జ్ఞాన దాత వారే. శివబాబా బ్రహ్మా ద్వారా వినిపిస్తారు, మళ్ళీ ఈ బ్రహ్మా కూడా వింటారు. బ్రహ్మాకు కూడా మొట్టమొదటి పుత్రికగా సరస్వతి గాయనం చేయబడ్డారు. బ్రహ్మాకుమారీ సరస్వతి జగదంబ ఎంతగా గాయనం చేయబడ్డారు! వారు బ్రహ్మా కన్నా కూడా ఎక్కువ వారసత్వాన్ని తీసుకుంటారు, అందుకే మొదట లక్ష్మీ ఆ తర్వాత నారాయణ అని అంటూ ఉంటారు. మనము జగదంబ మరియు జగత్పితల పిల్లలము, మరి తాతగారి నుండి వారసత్వాన్ని ఎందుకు తీసుకోకూడదు? బ్రహ్మాకుమారులు, కుమారీలమైన మనం తాతగారి మనవలము, మనవరాళ్ళము అంతే. ఆ తర్వాత రెండవ, మూడవ తరాలు ఉండవు, ముని మనవలు ఎవరూ ఉండరు. తాతగారిని ఎవరు తల్చుకోరు? మనం ఎంతగా స్మృతి చేస్తామో అంతగా వికర్మలు వినాశనమవుతాయని మీకు తెలుసు. శివ

పరమపిత పరమాత్మ స్వర్గ రచయిత అని మీరు ఎవరికైనా అర్థం చేయించవచ్చు. తప్పకుండా వారు బ్రహ్మ ద్వారా రచిస్తారు, మళ్ళీ బ్రహ్మకుమారులు, కుమారీలకు బ్రహ్మ ద్వారా - నన్ను మరియు వారసత్వాన్ని (స్వర్గమును) స్మృతి చేయండి అని చెప్తారు. దేహం యొక్క సర్వ సంబంధాలను మరిచిపోండి. మీరు మరణిస్తే మీకు సంబంధించినంత వరకు ప్రపంచము మరణించినట్లే అని అంటారు కదా. ఆత్మ శరీరము నుండి వేరైపోతే ఇక ఏమీ ఉండదు. దేహం యొక్క అభిమానము తొలగిపోతుంది. మనం బాబా వద్దకు వచ్చాము, మళ్ళీ మనం తెల్లగా అవుతాము. ఇప్పుడు శ్యామముగా ఉన్నాము. ఇది శ్యామముగా మరియు సుందరముగా అయ్యే నాటకము. ఆత్మ పవిత్రముగా, సుందరంగా అవుతుంది. ఇప్పుడు మీ ఆత్మ ఇనుప యుగముదిగా అయిపోయింది, కావున శరీరాలు కూడా అలాగే ఉన్నాయి. సత్యయుగంలో మీరు తెల్లగా ఉండేవారు. ఒక్క సుందరుడైన యాత్రికుడు తెల్లగా తయారుచేసేందుకు వస్తారు. వారి ఆత్మ సదా తెల్లగానే ఉంటుంది. ఎప్పుడూ మాలిన్యం చేరుకోదు ఎందుకంటే వారు జనన-మరణాలలోకి రారు. ఎంత సహజం చేసి అర్థం చేయిస్తారు! అయినా కూడా అటువంటి తాతగారిని మరిచిపోయి విడాకులిచ్చేస్తారు అందుకే, బాబా అంటారు, అతి మహాన్ మూర్ఖులను చూడాలన్నా మరియు అతి తెలివైనవారిని చూడాలన్నా ఇక్కడే చూడండి. మూర్ఖులు కూడా ఎలా ఉంటారంటే, అతి సహజమైన రెండు విషయాలను కూడా అర్థం చేసుకోలేరు. కేవలం - మనం ఆత్మలము, ఆ నిరాకార పరమాత్మ మన తాతగారు అని అర్థం చేసుకోవాలి. ఈ ప్రజాపిత బ్రహ్మ అయితే ప్రసిద్ధమైనవారు. వారి ద్వారా శివబాబా వారసత్వాన్ని ఇస్తారు. బ్రహ్మను విడిచిపెట్టి, తాతగారిని కూడా విడిచిపెట్టినట్లయితే వారసత్వం సమాప్తమైపోతుంది. బాబా ఎంత సహజం చేసి అర్థం చేయిస్తారు! మనము బ్రహ్మకుమారులము, కుమారీలము. బ్రహ్మ, విష్ణు, శంకరులు సూక్ష్మవతనవాసులు. అందులో కూడా బ్రహ్మను ప్రజాపిత అని అంటారు. సూక్ష్మవతనంలోనైతే మనుష్య సృష్టిని రచించడం జరగదు. శంకరుడిని లేక విష్ణువును ప్రజాపిత అని అనలేరు. ప్రజల పిత అయితే తప్పకుండా ఇక్కడే ఉంటారు. బ్రహ్మ ముఖ కమలము నుండి బ్రాహ్మణులు వెలువడ్డారు. మీరు ఎవరి వంశావళి అని బ్రాహ్మణులను అడగండి. ఇది కేవలం గాయనం అయ్యింది, ఇకపోతే, అటువంటిది ఉండదు.

పరమపిత పరమాత్మ బ్రహ్మ ద్వారా దేవత, క్షత్రియ ధర్మాలను స్థాపన చేస్తారు, అది సంగమయుగంలోనే చేస్తారు అని ఇప్పుడు మీకు తెలుసు. సంగమయుగంలో బ్రాహ్మణులు తప్పకుండా కావాలి. కలియుగాంతంలో శూద్రులు ఉన్నారు. పిల్లలైన మీకు ఎంత మంచి రీతిలో అర్థం చేయించడం జరుగుతుంది! శ్రీమతం ప్రసిద్ధమైనది. శ్రీమత్ భగవద్గీత. దాని ద్వారా ఏం వినడం జరుగుతుంది? శ్రీ శ్రీ జ్ఞానమును వినిపించి ఉంటారు, శ్రేష్ఠాతి శ్రేష్ఠముగా తయారుచేసి ఉంటారు. ఇప్పుడు మీరు ప్రాక్టికల్ గా బి.కె.లుగా అయ్యారు. మీరు అంటారు - బాప్ దాదా, మేము కల్ప క్రితము కూడా మిమ్మల్ని కలుసుకున్నాము, మేము తాతగారి నుండి మా వారసత్వాన్ని తీసుకొనేందుకు వచ్చాము. అచ్ఛా, వారి ద్వారా ఎలా తయారయ్యారు - సూర్యవంశీయులుగా అయ్యారా లేక చంద్రవంశీయులుగా అయ్యారా? శ్రీ నారాయణుడిని వరించారా లేక శ్రీ రాముడిని వరించారా? బాబా, మేము శ్రీ నారాయణుడిని వరిస్తాము అని అంటారు. కానీ మళ్ళీ మర్చిపోతారు, ఎవరైతే ఇంతటి యోగ్యులుగా తయారుచేస్తారో వారిని మర్చిపోతారు. తాతగారిని లేక తండ్రిని ఎవరూ మరిచిపోకూడదు. వెంటనే విడాకులిచ్చేస్తారు, స్మృతి చేయరు. జ్ఞానము యొక్క రెండు పదాలను ధారణ చేయరు. మనము సద్గురువు యొక్క మనవలము లేక తాతగారికి మనవలము. పురుషార్థము ద్వారా వారి నుండి వారసత్వాన్ని తీసుకుంటాము. లౌకిక తండ్రి వారసత్వము లేక ఆస్తి అయితే పంచబడుతుంది. ఇక్కడ పంచే వస్తువు కాదు, ఇందులో పురుషార్థం చేయవలసి ఉంటుంది. చంద్రుడు మొదలైనవాటిలో ప్లాటు కొనుక్కునేదేమీ లేదు. ఇక్కడ రాజ్యానికి యజమానులుగా అవుతారు. పాత్రనైతే ఇక్కడే అభినయించాలి. చంద్రుడు మొదలైనవాటిలోకి వెళ్ళేది లేదు, దీనిని సైన్సు యొక్క అహంకారము అని అంటారు. అతి అహంకారములోకి వెళ్ళడంతో వినాశనాన్ని పొందుతారు. ఏమేమి వెలువడ్డాయి! వేలాది-లక్షలాది మైళ్ళ వరకు వెళ్తారు. ఇప్పుడు వారు ఎక్కడి వరకు చేరుకున్నారు? పైన చంద్రుడిలో ఏముంది? అన్నది ఇక్కడ వారికి తెలుస్తుంది. చంద్రుడైతే శీతలమైనవారు కదా. సూర్యుని ఎదురుగా వెళితే కాలిపోతారు. సైన్సు యొక్క అహంకారము ఎంతగా ఉంది. దానికి రాకెట్ అన్న పేరును కూడా పెట్టారు. ఆత్మ అన్నింటికన్నా పెద్ద రాకెట్ అని బాబా అర్థం చేయించారు. అది ఒక బిందువే. దానికి బరువేముంటుంది? బిందువులో ఎంతగా జ్ఞానమంతా ఉంది! ఒక్క క్షణంలో ఎక్కడి నుండి ఎక్కడికో ఎగిరిపోతుంది. బాబాను స్మృతి చేయగానే క్షణంలో ఎగిరిపోతారు. ఇది కూడా తెలివైన(తీక్షణమైన) బుద్ధి కలవారే అర్థం చేసుకొని అర్థం చేయించగలరు. శివబాబా కూడా బిందువు. లింగ స్వరూపము అని అనడంతో, ఇంత పెద్ద ఆత్మ అయితే ఉండదు, అలాగే పరమాత్మ కూడా అలా ఉండరు అని అంటారు. వారు పరమాత్మ అయితే బ్రహ్మ తత్త్వము అని అంటారు. ఏమీ అర్థం చేసుకోలేరు. ఎప్పటి వరకైతే ఎవరూ సమ్ముఖంగా రారో అప్పటివరకు పరమాత్మ నామరూపాలు మొదలైనవాటిని అర్థం చేసుకోలేరు.

మనము శివబాబా చిత్రాన్ని చూపిస్తాము కానీ వారు అలా ఉండరు. వారు బిందువు రూపము, కానీ బిందువును ఎలా పూజిస్తాము, పుష్పాలు మొదలైనవాటిని ఎలా అర్పిస్తాము? కావున ఈ భక్తి మార్గం కొనసాగుతూ వచ్చింది, పూజ కొరకు మందిరాలలో పెద్ద రూపాన్ని తయారుచేసారు.

అచ్ఛా, బాబా అంటారు, ఎవరి బుద్ధిలోనైనా ఈ జ్ఞానము కూర్చోకపోయినా కూడా ఇదైతే అర్థం చేసుకోగలరు కదా - మేము బ్రహ్మాకుమారులము, కుమారీలము, తాతగారికి మనవలము. ఉన్నతోన్నతమైనవారు శివ భగవానుడు. వారి రచనను గాడ్ ఫాదర్ అని అనరు. మనం వారి మనవలము. నేను మిమ్మల్ని స్వర్గానికి యజమానులుగా తయారుచేస్తాను అని వారు అంటారు. ఇప్పుడు మనం తమోప్రధానంగా నల్లగా ఉన్నామని మీకు కూడా తెలుసు. బాబా ద్వారా సతోప్రధానంగా తెల్లగా అవుతున్నాము. మళ్ళీ కామచితిపైకి ఎక్కడం ద్వారా అందరూ నల్లగా అయిపోతారు. శ్యామముగా మరియు సుందరంగా అవుతారు. ఇప్పుడు మళ్ళీ సతోప్రధానంగా అయ్యేందుకు తండ్రిని స్మృతి చేయాలి. ఒక్క యాత్రికుడు ఎంతమందిని సుందరంగా తయారుచేస్తారు, విశ్వానికి యజమానులుగా తయారుచేస్తారు! కేవలం అంటారు - తండ్రినైన నన్ను స్మృతి చేయండి. లేదంటే వారసత్వం ఎలా లభిస్తుంది? వికర్మలు వినాశనమయ్యేందుకు యోగాగ్ని కావాలి. ఘడియ-ఘడియ స్మృతి చేయాలి. మేమైతే పిల్లలమే కదా అని చాలామంది భావిస్తారు. కానీ రోజంతా స్మృతి చేయకపోతే వికర్మలు వినాశనమవ్వవు, సంతోషమనే పాదరసము ఎక్కదు. 20-25 సంవత్సరాల వారికి కూడా ఈ విషయం బుద్ధిలో కూర్చోదు. మర్చిపోతారు. మళ్ళీ పాత ప్రపంచంలోకి వెళ్ళి భాగ్యానికి అడ్డు గీతను గీసుకుంటారు. తల్లిదండ్రుల ఒడిలోకి రావడంతోనే భాగ్యం ప్రారంభమవుతుంది. మమ్మా, బాబా అని అనడంతో స్వర్గానికి హక్కుదారులుగా అయితే అయ్యారు కదా. మా హిందుస్థాన్ అన్నింటికన్నా ఉన్నతమైనది అని ప్రజలు కూడా అంటారు కదా. అరే, అన్నింటికన్నా ఉన్నతమైనది అయినట్లయితే మళ్ళీ అప్పులెందుకు తీసుకుంటారు, నిరుపేదలుగా ఎందుకు అవుతారు? ఇక్కడి నుండి చాలా ధనమును తీసుకువెళ్ళారు. కర్మాగారాల ద్వారా సంపాదన జరుగుతుంది. కర్మాగారాలు వెలువడకపోతే కొంతమందికి ఉద్యోగాలు లభించవు. ఉద్యోగాలు లభించకపోతే పాలన ఎలా చేస్తారు? దుఃఖితులుగా అయిపోయారు, అందుకే భారత్ కొరకు ఎంతటి యుక్తిని రచించడం జరిగింది. పిల్లలకు చాలా దుఃఖము కలగకుండా ఉండేందుకే ఈ యుక్తి ఉంది. ఉద్యోగాలు చేసుకునేందుకు ఇక్కడి నుండి ఎంతోమంది బయటకు వెళ్ళారు, ఎందుకంటే అక్కడ చాలా ధనము లభిస్తుంది. తండ్రి అంటారు, నాకైతే ముళ్ళపైన కూడా ప్రేమ ఉంది. వచ్చి పతితులందరినీ పావనంగా తయారుచేస్తాను. ముళ్ళపైనా కూడా ప్రేమ ఉంది, అలాగే ముళ్ళ నుండి ఎవరైతే పుష్పాలుగా అవుతారో వారి మీద కూడా ప్రేమ ఉంది. డ్రామానుసారంగా అందరికీ సద్గతిని ఇస్తాను. సర్వుల సద్గతి దాత రామ... మరి అందరికీ ప్రియమైనవారు అయినట్లు కదా. వారిలో ముళ్ళు కూడా ఉన్నారు, పుష్పాలు కూడా ఉన్నారు. నియమానుసారంగా స్వర్గ స్థాపన జరుగుతుంది కావున దాని కొరకు యోగ్యులుగా కూడా తయారుచేస్తారు. పతిత పావనా రండి, వచ్చి పావనంగా తయారుచేయండి అని అంటారు కదా. ఇప్పుడు మీకు తెలుసు, పతిత పావనుడైన తండ్రి వచ్చారు. విశేషంగా భారత్ ను మరియు సాధారణంగా ప్రపంచమంతటినీ పావనంగా తయారుచేస్తారు. సర్వోదయ లీడర్ అన్న పేరును పెట్టారు. వారు కూడా తమపై పేరును పెట్టుకున్నారు, ఎలాగైతే శ్రీ శ్రీ 108 అని చెప్పుకుంటారు. సర్వులు అనగా అందరు. మనుష్యులు ఎవ్వరూ అందరి సద్గతిని చేయలేరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. దేహ భానాన్ని మరిచిపోయేందుకు జీవిస్తూనే మరణించాలి. మీరు మరణిస్తే మీకు సంబంధించినంత వరకు ప్రపంచమంతా మరణించినట్లే. పదే-పదే ఈ దేహము నుండి అతీతంగా అయ్యే ప్రాక్టీస్ చేయాలి.

2. మనము తాతగారికి మనవలము. మనము యోగ్యులుగా అయి వారి నుండి పూర్తి-పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలి. ఆత్మను యోగబలంతో పావనంగా తయారుచేసుకోవాలి. సంతోషంగా ఉండాలి.

వరదానము:- అశాంతి లేక హంగామాల మధ్యన శాంతి కుండమును అనుభూతి చేయించే శాంతి స్వరూప భవ
ఏ స్థానంలోనైనా హంగామా జరుగుతుంటే ఆ గొడవల సమయంలో శాంతి శక్తి యొక్క అద్భుతమును చూపించండి. ఇక్కడ ఇదైతే శాంతి కుండము అని అందరి బుద్ధిలోకి రావాలి, శాంతి కుండంగా అయి

శాంతి శక్తిని వ్యాపింపజేయండి, శాంతి స్వరూపంగా అయి శాంతి కుండమును అనుభవం చేయించండి. ఆ సమయంలో వాచా సేవ చేయలేరు కానీ మనసా ద్వారా శాంతి కుండము యొక్క ప్రత్యక్షత చేయగలరు. కేవలం ఇక్కడ నుండి శాంతి లభిస్తుంది అని అందరికీ వైబ్రేషన్లు రావాలి. మరి అటువంటి వాయుమండలమును తయారుచేయండి.

స్లోగన్:- స్వయం యొక్క మరియు సర్వుల యొక్క చింతలను తొలగించడమే శుభచింతకులుగా అవ్వడము.